# జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం పెరగాలి

- ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేస్తే పోలీసులకు సమాచారమివ్వండి
- ఎస్పీ డాక్టర్ వినీత్ జీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్ జీ

ఇల్లెందు, అక్టోబర్ 25 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఎస్పీ డాక్టర్ వినీత్ జీ ప్రజలను కోరారు. భారత్ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న పోలీస్ గెస్ట్ హౌజ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో జిల్లాలో 70 శాతంలోపే పోలింగ్ నమోదయిందని, కానీ ఈ ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటును వినియోగించుకొని 95 శాతానికి పైగా నమోదు అయ్యేలా చూడాలన్నారు. జిల్లా నలుమూలలా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మతాలు, కులాల పేరుతో ఎన్నికల్లో ఎవరైనా ప్రచారం చేసినా, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగులు పెట్టినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి దగ్గర రూ.50వేలకు మించి ఉండరాదన్నారు. అంతకు మించి ఉంటే సీజ్ చేస్తామని తెలిపారు. సీజ్ చేసినంత మాత్రాన నేరం చేసినట్టు కాదన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ కమిటీకి సీజ్ చేసిన వాటిని పంపుతామని, సరైన పత్రాలను చూపిస్తే 24గంటల వ్యవధిలోపై వాటిని రిలీజ్ చేస్తారన్నారు. ముందుగా పట్టణంలోని బుగ్గవాగు సమీపంలో ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంకును ఆయన ప్రారంభించారు. పోలీస్ వేల్ఫేర్ పెట్రోల్ బంకులు జిల్లాలో పాల్వంచ, ఇల్లెందులో నడిపిస్తున్నామన్నారు. కనీస లాభం చూసుకొని వినియోగదారులకు ఎక్కువ సేవ చేయచేయడమే లక్ష్యంగా మా బంకులు పనిచేస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ టి.సాయిమనోహర్, అడిషనల్ ఎస్‌పి ఇ.విజయబాబు, డీఎస్పీ రమణమూర్తి, ఇల్లెందు, టేకులపల్లి, గుండాల సీఐలు కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి, ఎల్.రవీందర్, వెల్ఫేర్ ఆర్‌ఐలు కామరాజు, సీహెచ్.కృష్ణారావు, పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన


హైస్కూల్లో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారిరామన్

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 25 : ఎన్నికలు సజావుగా సాగేవిధంగా అధికారులు తగు చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ సమయంలో ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సదుపాయాలు సిద్ధం చేస్తున్నట్లు నియోజకవర్గ నోడల్ అధకారి రామన్ తెలిపారు. బుధవారం మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని రింగ్ సెంటర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటరుకు తగు సదుపాయాలు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ కృషి చేస్తున్నదన్నారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించనున్నామన్నారు. ఆయన వెంట సెక్టార్ అధికారులు ఎంపీడీవో జి శ్రీనివాసరావు, ఏఈ కృష్ణ, సింద్దాంతపు ప్రభాకరాచార్యులు ఉన్నారు.

## పొదుపు పథకాలను ప్రచారం చేయాలి

చంద్రుగొండ, అక్టోబర్ 25 : తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పొదుపు పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, పథకాల్లో ప్రజలను భాగస్వాములుగా చేయాలని కొత్తగూడెం తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ చౌదరి బ్రాంచ్ పోస్టుమాస్టర్లను ఆదేశించారు. చంద్రుగొండ ఉప తపాలా కార్యాలయంలో పోస్టుమాస్టర్ రఘు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన గ్రామీణ తపాలా బీమా, రికరింగ్ డిపాజిట్ ఖాతాలు, సుకన్య సమృద్ధి తదితర ఖాతాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో మెయిల్ ఓవర్సీల్ సత్యనారాయణ, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు రిజ్వానా, రాణీ, గణేష్, రవితేజా, వెంటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొత్తగూడెం తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్

## ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్

### మదన్‌లాల్ గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం

### ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కారేపల్లి,అక్టోబర్ 25ఃఎన్నికల ప్రచారంలో సింగరేణి మండల బీఆర్ఎస్ శ్రేణులు దూసుకుపోతున్నారు.మండల పరిధిలోని జైత్రాంతండా,రేలకాయలపల్లి గ్రామపంచాయతీలలో బుధవారం తెల్లవారుజామున ఎంపీపీ మాలోత్ శకుంతల,జడ్పీటీసీ వాంకుడోత్ జగన్,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్‌ల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు ఇంటింటికి వెళ్లి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా ప్రజలను కలిసిన వారు గడిచిన తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుకు చేశారు.అదే విధంగా ప్రభుత్వ ఫలాలను పొందిన లబ్ధిదారులను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్దిని ఓటర్లకు వివరించారు.ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం అభివృద్దిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని మరో సారి అధికారంలోకి వస్తే ప్రపంచస్థాయిలో గుర్తుండిపోయేలా సీఎం కేసీఆర్ చేసి చూపిస్తారని ప్రజలకు అవగాహన కల్పించారు.బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం జరిగిందన్నారు.ఇటీవల సీఎం కేసీఆర్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాస రావు,రైతుబంధు మాజీ మండల కన్వీనర్ హన్మకొండ రమేష్,మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్,జైత్రాంతండా,రేలకాయలపల్లి,చీమలపాడు,పాటిమీదగుంపు సర్పంచ్‌లు లక్ష్మణ్,మాలోత్ కిషోర్,బానోత్ శంకర్,ఎంపీటీసీ బానోత్ మట్కు,నాయకులు బత్తుల శ్రీనివాస రావు,కిరణ్,చందర్,స్థానిక పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల కమిటీ సభ్యులు

టేకులపల్లి, అక్టోబర్ 25 : నవంబర్ 1న ఇల్లెందులో నిర్వహించే సీఎం సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో మండల అధ్యక్ష, కార్యదర్శులు వరప్రసాద్ గౌడ్, బోడ బాలునాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 1న ఇల్లెందులో జరుగనున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ రామ, బానోత్ కిషన్, చీమల సత్యనారాయణ, దళపతి శ్రీనివాస రాజు, బర్మావత్ శివకృష్ణ, గుగులోత్ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

## అనిల్ మృతదేహానికి మున్సిపల్ చైర్మన్ నివాళి


నివాళులర్పిస్తున్న దమ్మాలపాటి వెంకటేశ్వరరావు

ఇల్లెందు, అక్టోబర్ 25 : పట్టణంలోని 4వ వార్డుకు చెందిన అనిల్ లోధ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. ఆయన మృతివార్త తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అనిల్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపాడు. చైర్మన్‌తో పాటు స్థానిక కౌన్సిలర్ ఎస్‌డీ ఆజాం, మాజీ కౌన్సిలర్ ఎలమందల వాసు తదితరులున్నారు.

## 'కోరం'కు టికెట్ ఇవ్వొద్దని ఢిల్లీలో ధర్నా


ఢిల్లీలో ధర్నా చేస్తున్న ఇల్లెందు కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు, అక్టోబర్ 25 : గతంలో పార్టీని మోసం చేసి మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చిన కోరం కనకయ్యకు ఇల్లెందు టికెట్ ఇవ్వొద్దంటూ పలువురు ఆశావహులు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. పదేళ్లుగా పార్టీని నమ్ముకొని.. పార్టీ కోసం పనిచేస్తూ.. జెండా మోసిన నాయకులకు టికెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. సేవ్ కాంగ్రెస్.. సేవ్ ఇల్లెందు.. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఆశావహులు భూక్యా దళ్‌సింగ్, చీమల వెంకటేశ్వర్లు, కామేపల్లి జడ్పీటీసీ వెంకటప్రవీణ్, నాగేంద్ర నాయక్, విజయలక్ష్మి, శంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

దమ్మపేట, అక్టోబర్ 25 : మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పక్కన బీఆర్ఎస్ మండల కార్యాలయాన్ని ఖమ్మం ఎంపీ, లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి గురువారం ప్రారంభం చేయనున్నట్లు మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేశ్ బుధవారం తెలిపారు. అనంతరం మల్లారం రోడ్‌లోని నూతన కోర్టు కార్యాలయం ఎదురుగా ఉన్న మామిడితోటలో మండల స్థాయి నాయకులతో సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.